


## వైసీపీ బీఆర్ఎస్... సేమ్ టూ సేమ్ !

ఏపీలో వైసీపీ కానీ తెలంగాణాలో బీఆర్ఎస్ కానీ సేమ్ టూ సేమ్ గా వ్యవహరిస్తున్నాయా అంటే జవాబు అవును అనే వస్తోంది. ఈ రెండు పార్టీలు ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నాయి. ఈ పార్టీలు అధికారంలో ఉన్నపుడు స్నేహ సంబంధాలను బాగా నెరిపేవి అని అప్పట్లో ప్రచారం సాగింది. కేసీఆర్ జగన్ ఇద్దరూ మంచి దోస్తులు గా రెండు తెలుగు రాష్ట్రాలలో వ్యవహరించారు అని కూడా అంతా చెప్పుకున్నారు. ఇక ఒకేసారి రెండు పార్టీలు విపక్షంలోకి వచ్చాయి. అయితే ఈ రెండు పార్టీల అధినాయకులు చేస్తున్న ప్రకటనలు కానీ వారు ఆలోచనలు కానీ వారి వైఖరి కానీ ఒకేలా ఉండడమే చర్చనీయాంశంగా ఉంది.

ాతీఫ్అటఅఝ్రీ ×త్వశ్రీఅస్త్రవఅషవ బంవం

**అసెంబ్లీకి దూరంగా :**

కేసీఆర్ 2023లో ఓటమి పాలు అయిన దగ్గర నుంచి అసెంబ్లీకి దూరంగానే ఉంటూ వస్తున్నారు. అక్కడ సగం పాలన పూర్తి అయింది కానీ కేసీఆర్ అసెంబ్లీకి అయితే వెళ్ళింది లేదని అంటున్నారు. ఆయన మళ్లీ సీఎం గానే అసెంబ్లీ ముఖం చూడాలని అనుకుంటున్నారు అని చెబుతారు. ఇక ఏపెలో చూసినా జగన్ ధోరణి కూడా అలాగే ఉంది. ఆయన కూడా అసెంబ్లీకి దూరం పాటిస్తున్నారు. ఏపీలో కూటమి పాలన రెండేళ్ళు పూర్తి అయింది. కానీ జగన్ అసెంబ్లీకి వెళ్ళింది లేదు, మిగిలిన కాలంలో వెళ్తారు అన్న గ్యారంటీ కూడా లేదని అంటున్నారు.

**విరుచుకుపడడంలోనూ :**

ఇష్యూ ఏది అయినా విరుచుకుని పడడంతో అటు వైసీపీ కానీ ఇటు బీఆర్ఎస్ కానీ ఒకే తీరున ఉంటాయని కూడా అంటున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ గట్టిగానే పోరాటం చేయడంతో ఈ రెండు పార్టీలు ముందున్నాయి. అదే విధంగా ఈ పార్టీల కీలక నేతలు పాదయాత్రకు కూడా ఆలోచిస్తున్నారు. జగన్ కేటీఆర్ దాదాపుగా ఒకే సమయంలో పాదయాత్రకు శ్రీకారం చుడతారు అని కూడా అంటున్నారు. ఈ విధంగా జనాలకు చేరువ కావాలన్నది వారి ఆలోచన అని కూడా చెబుతున్నారు.

**మేమొస్తామంటూనే అలా :**

ఇక చూస్తే అన్యాయం జరిగింది అని ఎవరైనా బాధితులు మొర పెట్టుకుంటే వారికి తక్షణ ఉపశమనం కలిగిస్తేనే సంతోషిస్తారు. కానీ ఈ పార్టీల నాయకులు మాత్రం మేము అధికారంలోకి వస్తున్నాం అంతవరకూ ఓపిక పట్టు అని చెబుతున్నారు. ఏపీలో జగన్ అయితే ఈ విషయంలో మరో మూడేళ్ళు కళ్ళు మూసుకుంటే చాలు వచ్చేది వైసీపీనే అపుడు కచ్చితంగా న్యాయం చేసి తీరుతామని భరోసా ఇస్తున్నారు. ఇపుడు అదే మాట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా అనడమే విశేషం. తాజాగా ఆయన ఒక ప్రకటన చేశారు. తెలంగాణాలో రైతులు ఎవరూ తొందరపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు అని కూడా కోరారు. రెండేళ్ల పాటు ధైర్యంగా ఉండాలని సూచించారు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వం కాబట్టి రైతులకు పూర్తి న్యాయం చేస్తామని అంటున్నారు.

**ప్రతిపక్షం అంటే :**

ప్రతిపక్షాలు గతంలో తీసుకున్న వైఖరి వేరే విధంగా ఉండేదని చెబుతారు. ప్రభుత్వాన్ని వారు తమ ఉద్యమాల ద్వారా గడగడలాడించే వారు సమస్యలకు ప్రభుత్వం నుంచి పరిష్కారాలు రాబట్టేవారు. ఇపుడు ఆ పరిస్థితి పోయిందా అన్న చర్చ వస్తోంది. ప్రతిపక్షం అయితే తాము ఎంతగా మొత్తుకున్నా ప్రభుత్వం వినదు కాబట్టే తాము వస్తేనే న్యాయం చేస్తామని చెబుతున్నామని అంటోంది. ఇక అధికార పక్షాలు అయితే తాము ఏదైనా మేలు చేస్తే అది విపక్షం ఖాతాలోకి పోతుందేమో అని చేయడం మానుకుంటున్నాయి. ఈ విచిత్రమైన రాజకీయంలో ఎవరి ఓడినా సరే పోరాటాలు సంగతి పక్కన పెడితే మళ్లీ తాము అధికారంలోకి వస్తేనే చేస్తామని చెప్పడం పరిపాటిగా మారుతుందా అన్న సందేహాలు అయితే వస్తున్నాయి.

## అంతా బూటకం.. రైతులను మోస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

మోసమని మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కొట్టిపారేశారు. రైతుల ను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు రికార్డులను ఆయనే తిరగరాశారని ఎద్దేవా చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ మోసమేనని మండిపడ్డారు. తాము మేనిఫెస్టోలో చెప్పినదాని కంటే ఎక్కువే చేశామని తెలిపారు. 53.58 లక్షల మందికి రైతుల భరోసా అందించామని చెప్పారు. కరోనా సమయంలోనూ వెనక్కి తగ్గలేదన్నారు. పీఎం కిసాన్ యోజనకు అదనంగా రూ. 20 వేలు ఇస్తామని మాట తప్పారని తెలిపారు. పథకం నుంచి 7 లక్షల మందిని తొలగించారని చెప్పారు. కౌలు రైతులు, గిరిజనులకు మొండిచెయ్యి చూపారని జగన్ విమర్శించారు. ఒక్క పంటకు సైతం గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. ధరల స్థిరీకరణ నిధికి ఎగనామం పెట్టారని చెప్పారు. ఫీడ్ ధరలు పెంచి ఆక్వా రైతుల ను నట్టేట ముంచారని జగన్ ఆరోపించారు.

## విస్తరించిన ఉపరితల ఆవర్తనం.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి

- మొదటి పేజీ తరువాయి

సంస్థ పేర్కొంది. వీటి ప్రభావంతో నేడు మేఘవృతమైన వాతావరణంతో పాటు చెదురుమదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మిగతా జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే పొలాల్లో పనిచేసే రైతులు, శ్రామికులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు

# నీట్ బాగా టఫ్.. భారీగా తగ్గనున్న కటాఫ్

దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ ముగిసింది. అయితే ఈసారి పేపర్ సరళిపై విద్యార్థులు, సబ్జెక్టు నిపుణుల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఈ ఏడాది మే3న జరిగిన పేపర్ తో పోలిస్తే ఈసారి క్వశ్చన్ పేపర్ చాలా కఠినంగా వచ్చిందని, దీనివల్ల కటాఫ్ మార్కులు భారీగా తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఓ ప్రముఖ సబ్జెక్టు నిపుణుడు విశ్లేషించిన వివరాల ప్రకారం.. ఈసారి పపీక్షలో లెవెల్-3 కింద అడిగిన అత్యంత కఠినమైన ప్రశ్నలే దాదాపు 16 వరకు వచ్చాయి. లెవెల్-0 లో కేవలం 2 ప్రశ్నలు, లెవెల్-1 లో 10 ప్రశ్నలు మాత్రమే వచ్చాయని ఆయన పేర్కొన్నారు. దీనిని బట్టి పేపర్ ఏ స్థాయిలో కఠినంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అత్యంత కఠినంగా ఫిజిక్స్..

గత 2025 మే పరీక్షతో పోలిస్తే కొంత నయమే అనిపించినప్పటికీ, మొన్న మే 3వ తేదీన జరిగిన 2026 మొదటి విడత పరీక్షతో పోలిస్తే మాత్రం ఈ రీ-ఎగ్జామ్ ఫిజిక్స్ పేపర్ చాలా కఠినంగా వచ్చిందని విద్యార్థులు చెబుతున్నారు. ఐఐటీ ఎంట్రన్స్ పరీక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్డ్ స్థాయిలో ప్రాబ్లమ్ ఓరియెంటెడ్ ప్రశ్నలు ఇవ్వడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2025 నీట్ పరీక్షతో పోల్చితే ఈసారి కెమిస్ట్రీ పేపర్ అత్యంత కఠినంగా మారింది. కొన్ని ప్రశ్నలు ఫిఫ్టీ ఫిఫ్టీ స్థాయిలో ఉన్నప్పటికీ, ఫిజిక్స్ తరహాలోనే కెమిస్ట్రీలో కూడా ప్రాబ్లమ్ ఓరియెంటెడ్ ప్రశ్నలు ఎక్కువగా రావడంతో విద్యార్థులు సమాధానాలు గుర్తించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. పేపర్ టఫ్గా రావడంతో చాలా మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు, నిరాశకు గురైనట్లు తెలుస్తోంది. 2025 పేపర్తో పోలిస్తే బయాలజీ కొంత సులభంగానే ఉన్నప్పటికీ.. మే 2026 పరీక్షతో పోలిస్తే దాదాపు అదే స్థాయిలో సమతూకంగా వచ్చింది. బాటనీ, జువాలజీ విభాగాల్లో ప్రశ్నలు విద్యార్థులను కాస్త ఊరటనిచ్చాయి. ఏ విద్యార్థులైతే టైమ్ మేనేజ్ చేసుకుంటూ బయోసైన్స్ బాగా రాస్తారో, వాళ్లకే మంచి ర్యాంకులు డిసైడ్ అవుతాయని నిపుణులు చెప్తున్నారు.

**భారీగా తగ్గనున్న కటాఫ్..**

ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు రెండూ తీవ్రమైన సవాల్ విసరడంతో విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారు. గతంలో 720/720 మార్కులు సాధించిన రికార్డులు ఉన్నప్పటికీ, ఈసారి మాత్రం బైకి బై మార్కులు వచ్చే అవకాశం అస్సలు లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నెగిటివ్ మార్కుల ప్రభావం ఈసారి ఫలితాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అయితే, పేపర్ కఠినంగా వచ్చినప్పుడు అది అందరికీ వర్తిస్తుంది కాబట్టి తల్లిదండ్రులు, విద్యార్థులు అస్సలు బాధపడాల్సిన అవసరం లేదని నిపుణులు పేర్కొన్నారు. 2025 నాటి కటాఫ్ మార్కులతో పోలిస్తే ఈసారి నీట్-2026 రీ-ఎగ్జామ్ కటాఫ్ మార్కులు భారీగా కిందికి దిగివచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలో 450-460 మార్కులు వస్తేనే సీటు వస్తుందనుకున్న చోట, ఈసారి 420 మార్కులు వచ్చినా మెడికల్ సీటు సాధించే అవకాశం ఉంటుందని నిపుణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మార్కులు తగ్గొచ్చు కానీ, ర్యాంకులు మాత్రం తగ్గవని వారు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు స్పష్టం చేశారు. తల్లిదండ్రులు పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ బాధపెట్టవద్దని, రద్దయిన పేపర్ బాగా రాసి ఇప్పుడు సరిగ్గా రాయలేదని ఒత్తిడికి గురిచేయకూడదని, మంచి ఫలితాలనే ఆశిద్దామని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణ తెలిపారు.

**పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల ఇబ్బందులు - తొలిసారి కొత్త నిబంధనలు**

మరోవైపు కొన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. థంబ్ ఇంప్రెషన్ సరిగ్గా పడకపోవడం, ఐరిష్ బాగోలేదని ఫొటోలు, సంతకాల పేరుతో విద్యార్థుల సమయం వృథా చేయడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత కూడా సంతకాలు పెట్టాలంటూ కొన్ని సెంటర్లలో సిబ్బంది ఇబ్బంది పెట్టారని విద్యార్థులు వాపోయారు. అయితే, ఈసారి విద్యార్థుల డిమాండ్ మేరకు తొలిసారిగా పరీక్షా కేంద్రాల్లో పవర్ కట్ సమస్యలు రాకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచారు. అలాగే ప్రతి క్లాస్ రూమ్లోనూ వాల్ క్లాక్ (గోడ గడియారం) ఉండాలనే నిబంధనను ఈసారి వంద శాతం అమలు చేయడం విద్యార్థులకు కొంత మేలు చేకూర్చింది.

## బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం

సింగరేణిలో రూ.1,600 కోట్ల విలువైన భారీ బొగ్గు కుంభకోణం జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తీవ్రంగా ఖండించింది. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల వరకు ప్రతి దశ పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపింది.సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతైందని, దీనిపై తక్షణమే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేయడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే సింగరేణి యాజమాన్యం వివరణ ఇచ్చింది.గనుల్లో బొగ్గు వెలికితీసిన క్షణం నుంచి వినియోగదారుడికి చేరే వరకు ప్రతి అంశం డిజిటల్గా నమోదవుతుందని కంపెనీ వివరించింది. సుమారు 85 శాతం బొగ్గు రైళ్ల ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గంలో రవాణా అవుతుందని, శాప్ (ఎస్ఏపీ) ఆధారిత ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ద్వారా బొగ్గు కేటాయింపులు జరుగుతాయని పేర్కొంది. రోడ్డు మార్గంలో వెళ్లే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ వే-బ్రిడ్జ్‌ల వద్ద తూకం వేస్తామని, ఆర్ఎఫ్ఐడీ ఆధారిత బూమ్ బారియర్లు, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలను పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థ పటిష్టంగా ఉందని యాజమాన్యం స్పష్టం చేసింది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత మధ్య బొగ్గు దొంగతనం లేదా మాయం కావడానికి ఆస్కారమే లేదని, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి 51:49 వాటాలు ఉన్న సింగరేణి సంస్థలో ఈ ఆరోపణలు కలకలం రేపాయి.

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్... స్వాగతం పలికిన ఎంపీలు

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. జాతీయ స్థాయిలో రెండు ప్రముఖ మీడియా సంస్థలు నిర్వహించే సదస్సులలో పాల్గొనేందుకు ఆయన ఆదివారం ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు టీడీపీ ఎంపీలు సాదరంగా స్వాగతం పలికారు.వివరాల్లోకి వెళితే, రిపబ్లిక్ టీవీ మరియు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంస్థలు రేపు (జూన్ 22) నిర్వహించనున్న వేర్వేరు కాంక్లేవ్‌లలో మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సదస్సుల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దార్శనికతను, పాలన విధానాలను జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఆయన సిద్ధమయ్యారు.

ఈ కార్యక్రమాలలో ముఖ్యంగా 'ఏపీ విజన్', రాష్ట్రంలో వ్యాపార అనుకూల వాతావరణం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన ప్రగతి వంటి అంశాలపై

లోకేశ్ మాట్లాడనున్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ఈ వేదికలను ఆయన ఉపయోగించుకోనున్నారు. ఈ పర్యటన ద్వారా ఏపీ ప్రభుత్వ ప్రాధాన్యతలను జాతీయ స్థాయిలో వివరించనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపిన మెహర్ రమేశ్...

ప్రముఖ సినీ దర్శకుడు మెహర్ రమేశ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పదవి లభించడం తెలిసిందే. ఏపీ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఞూఝాఖీఓఙజ) వైస్ చైర్మన్‌గా ఆయనను ఏపీలోని కూటమి ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఈ నేపథ్యంలో మెహర్ రమేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ భేటీ అనంతరం మెహర్ రమేశ్ సోషల్ మీడియా ద్వారా తన ఆనందాన్ని పంచుకున్నారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన పేరును ప్రతిపాదించి, మద్దతు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబును 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గాడ్‌ఫాదర్' అంటూ మెహర్ రమేశ్ అభివర్ణించారు.

రాష్ట్రంలో చలనచిత్ర, టీవీ, నాటక రంగాల అభివృద్ధికి ఈ కార్పొరేషన్ (ఞూఝాఖీఓఙజ) పనిచేస్తుంది. ఈ కీలక బాధ్యతను తనకు అప్పగించడం పట్ల మెహర్ రమేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, తన కుమార్తె వివాహానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానించారు.

## మరింత తీవ్రంగా దాడి చేస్తాం... ఇరాన్ కు ట్రంప్ మరోసారి వార్నింగ్

- మొదటి పేజీ తరువాయి

అమలు, లెబనాన్ సహా ఇతర ప్రాంతీయ భద్రతా అంశాలపై చర్చించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు చేరుకున్న సమయంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.ఇరు దేశాల మధ్య ఈ నెల ప్రారంభంలో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. అణు అంశాలు, హార్ముజ్ జలసంధి, లెబనాన్‌తో సహా పలు ప్రాంతాల్లో కాల్పుల విరమణపై 60 రోజుల పాటు చర్చలు జరపాలని ఇందులో నిర్ణయించారు. అయితే, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు, హిజ్బుల్లా మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగడంతో స్విస్ చర్చలు ఆలస్యమయ్యాయి.లెబనాన్‌లో కాల్పుల విరమణను కాపాడే ప్రయత్నాలపై ఉపాధ్యక్షుడు వాన్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి ఒప్పందాల అమలులో కొన్ని ఇబ్బందులు సహజమేనని, పరిస్థితి సున్నితంగా

ఉందని అంగీకరించారు. అధ్యక్షుడు ట్రంప్ తమకు పూర్తి అధికారాలు ఇచ్చారని వెల్లడించారు. ఇరాన్ అణ్వాయుధాలపై ఆశలు వదులుకుంటేనే అమెరికాతో సత్సంబంధాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. శాశ్వత కాల్పుల విరమణకు ట్రంప్ కట్టుబడి ఉన్నారని వాన్స్ ఉద్ఘాటించారు. కాగా, ట్రంప్ తాజా హెచ్చరికలపై ఇరాన్ నుంచి తక్షణమే ఎలాంటి స్పందన రాలేదు.

## రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు...

- మొదటి పేజీ తరువాయి

పాలనా సంస్కరణలను సమగ్రంగా ఇందులో పొందుపరచాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అసత్య ప్రచారాలను (ఫేక్ న్యూస్) తిప్పికొట్టేందుకు, వాస్తవాలను ప్రజల ముందు ఉంచి రాష్ట్రాన్ని ఎలా గాడిన పెట్టారో స్పష్టంగా తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ నివేదికల ద్వారా రెండేళ్ల ప్రభుత్వ పనితీరును ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## విజయవాడ యువకుడు సాయికృష్ణ కేసు.. దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

- మొదటి పేజీ తరువాయి

విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఎం. రవి ప్రకాశ్ ఈ సిట్‌కు నేతృత్వం వహించనున్నారు.ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ సభ్యులుగా ఉంటారని, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్. సుధాకర్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సాంకేతిక, ఫోరెన్సిక్ సహకారాన్ని పోలీస్ శాఖలోని వివిధ విభాగాల నుంచి తీసుకునేందుకు సిట్‌కు పూర్తి అధికారాలు కల్పించారు.ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ సస్పెండెడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) నాగరాజు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అక్రమ నిర్బంధం, హత్య, సాక్ష్యాల ధ్వంసం వంటి ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేయనుంది. మృతుడు సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 19న సీఐ నాగరాజుపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 127(4), 127(6), 103(1), 238 కింద కేసు నమోదు చేశారు. సింగ్ నగర్‌లోని ఆయన నివాసంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

**అసలేం జరిగింది?**

విచారణ పేరుతో మే 9న తన కుమారుడిని పోలీసులు తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతను తిరిగి రాలేదని తల్లి విజయలక్ష్మి ఆరోపిస్తున్నారు. కస్టడీలో చిత్రహింసలకు గురి చేసి, కొట్టి చంపేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా, జూన్ 15న సాయి కృష్ణను కోర్టులో హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. పోలీసులు విఫలం కావడంతో గడువును జూన్ 29కి పొడిగించింది.ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 17న సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశించడమే కాకుండా సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు బృందాలు ఇప్పటికే విజయలక్ష్మి, ఇతరుల వాంగ్మూలాలను నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీని, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాయి. సాయికృష్ణను చంపి దహనం చేశారని తల్లి ఆరోపించిన నేపథ్యంలో కృష్ణలంకలోని శ్మశానవాటికలో మే 23 నుంచి 26 మధ్య దహనం చేసిన అనాథ శవాల రికార్డులను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని, సాయి కృష్ణ, అతని తల్లి మొబైల్ ఫోన్ల కాల్ డేటా రికార్డులను భద్రపరచాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది.

## ముంబైలో మళ్లీ కరోనా కేసుల కలకలం!

- మొదటి పేజీ తరువాయి

ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు స్వైన్ ఫ్లూ కేసులు అధికంగా నమోదు కాగా, గత వారం నుంచి కోవిడ్ కేసులు మళ్లీ పుంజుకున్నాయని వైద్యులు చెబుతున్నారు. బ్రీచ్ క్యాండీ వంటి ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లలో ప్రతిరోజూ 7కు పైగా కోవిడ్ లేదా స్వైన్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఒకేసారి పలు వైరస్‌లు వ్యాప్తిలో ఉండటంతో, లక్షణాలు ఒకేలా ఉండటంతో నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు అవసరమవుతున్నాయని సీనియర్ వైద్యులు పేర్కొంటున్నారు.రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. గాలిలో వైరస్‌లు ఎక్కువసేపు నిలిచిపోవడానికి ఈ పరిస్థితులు దోహదపడుతున్నాయని బీఎంసీ ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా తెలిపారు. వర్షాలు విస్తారంగా కురిస్తే వాతావరణం శుభ్రపడి, వైరస్‌ల వ్యాప్తి తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ శాతం స్వల్ప లక్షణాలతోనే ఉన్నప్పటికీ, వృద్ధులు, గర్భిణులు, మధుమేహం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సొంతంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని, లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

## జూన్ 22న కాకినాడలో యథావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహణ

**కలెక్టర్ హరేందిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్, జూన్ 21:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు జూన్ 22న యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం, వివేకానంద హాల్‌లో రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే సమర్పించిన అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా, వాటి స్థితిగతులు తెలుసుకోవాలన్నా ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు.అలాగే ప్రజలు తమ ఫిర్యాదులు, వినతులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు వీవవనిశీయిఎ.ఖజా.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున, అర్జీదారులు తమకు సమీపంలోని కార్యాలయాల్లో కూడా ఫిర్యాదులు సమర్పించవచ్చని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# చత్రపతి శివాజీ మహారాజ్ ని స్ఫూర్తిగా తీసుకోవాలి.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 21:**ముస్లిం మతోన్మాదుల పాలనలో దేశానికి రాక్షస పాలన నుండి విముక్తి కలిగించిన చత్రపతి శివాజీ మహారాజును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు రాజబాబు అన్నారు. మండల కేంద్రం కిర్లంపూడి లోని విజ్ఞాన భారతి స్కూల్లో చత్రపతి శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ

**-మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు.**

సందర్భంగా
మండల బిజెపి అధ్యక్షులు రాజబాబు మాట్లాడుతూ
500 సంవత్సరాల క్రితం ఈ దేశం ముస్లిం మతోన్మాదుల పాలనలో ఉండేదని వాళ్ళ రాక్షస పాల నుండి దేశానికి విముక్తి కలిగించడం కోసం వీరమాత జిజియా బాయ్ తన పుత్రుడైన శివాజీని చిన్నతనం నుండే రామాయణ, మహాభారత , భాగవతం పురాణ వాంగ్మయాన్ని ఉగ్గుపాలతో నూరి పోసిందన్నారు. ప్రతి హిందువు చత్రపతి శివాజీ ని స్ఫూర్తిగా తీసుకొని దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. చత్రపతి శివాజీ మొఘల్ సామ్రాజ్యం విస్తరణను అడ్డుకొని హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించడంలో ఆయన చేసిన పోరాటం, చూపిన ధైర్యం చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ గాది శ్రీనివాసరావు, కోనేటి శ్రీనివాసరావు, పెండ్యాల నాగేశ్వరరావు, వెంకటేష్, స్కూల్ టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు

## ఏలేశ్వరం మున్సిపాలిటీలో ఘనంగా యోగ దినోత్సవం.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 21:** ఏలేశ్వరం మున్సిపాలిటీ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణ స్వాములు మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని,శారీరక ఆరోగ్యం,మానసిక ప్రశాంతత కోసం యోగా ఎంతో ఉపయోగకరమని తెలిపారు.యువత యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం యోగా ప్రోత్సాహానికి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.

# కిర్లంపూడిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం.





**-ప్రతిరోజు యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం.**

**-డిప్యూటీ ఎంపిడిఓ ఎస్.వి. సుబ్బారావు.**

**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 21:**ప్రతిరోజు యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగవంతులుగా ఉండవచ్చని డిప్యూటీ ఎంపిడిఓ, ఎస్ వి సుబ్బారావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఆధ్వర్యంలో శ్రీ సత్యదేవ కళ్యాణ మండపంలో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రిల్ మాస్టర్లు,యోగ గురువులుచే ప్రజల చేత యోగాసనాలు వేయించారు.యోగాసనాల అనంతరం బ్రహ్మకుమారి సమాజం వారిచే మెడిటేషన్ ఏర్పాటు చేసి, అందరితో మెడిటేషన్ చేయించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంపరిపాలన అధికారి,ఎన్. ఎం. కె ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్, ప్రసన్న, జగపతినగరం సెక్రటరీఎన్ టి ఆర్ రమేష్ బాబు, కె వీరనాగేంద్ర,మండల పరిషత్ సిబ్బంది,సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ సిబ్బంది ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రిల్ మాస్టర్లు పాల్గొన్నారు.

## యోగాతో జీవన విధానానికి ఎంతో మేలు.



**-మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గోపినాథ్.**

**కిర్లంపూడి/పెన్ పవర్జూన్ 21:** యోగా జీవన విధానానికి ఎంతో మేలు చేస్తుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎల్ గోపినాథ్ అన్నారు.అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ప్రతిపాడు కోర్టు ప్రాంగణంలో మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యోగా గురువు ప్రసాద్ అందరి చేత ఆసనాలతోపాటు,సూర్య నమస్కారాలు చేయించారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎల్ గోపీనాథ్, ప్యానల్ అడ్వకేట్ బుగతా వెంకట శివన్నారాయణ యోగాసనాలు,మెడిటేషన్ చేయటం వలన కలుగు ఉపయోగాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ శారదామని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బంది, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బంది, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు సిబ్బంది, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సిబ్బంది బార్ ప్రెసిడెంట్ రాజాల చిట్టిబాబు, ప్యానల్ అడ్వకేట్, ఆర్ అసోసియేషన్ న్యాయవాదులు,పోలీస్ స్టేషన్స్ సిబ్బంది,పారా లీగల్ వాలంటీర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం:

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి







- **అధికారులు, విద్యార్థుల భాగస్వామ్యం..**
- **యోగా శిక్షకులకు సత్కారం**

**అన్నవరం పెన్ పవర్ జూన్ 21:**కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా గత రెండు వారాలుగా (ది. 07.06.2026 నుండి 21.06.2026 వరకు) కొండపై ఉన్న పాత కళ్యాణ మండపంలో దేవస్థానశీ సిబ్బందికి, వ్రత పురోహితులకు, నాయీ బ్రాహ్మణులకు మరియు సేవా సభ్యులకు ప్రత్యేక యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరంలో దేవస్థానశీ వర్గాలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు సాధన చేశారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, అందరికీ యోగాపై అవగాహన కల్పించినందుకు గాను... అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని దేవస్థానం తరపున యోగా ఇన్‌స్ట్రక్టర్లను ఘనంగా సత్కరించారు. వారికి శ్రీ స్వామి వారి చిత్రపటము, శాలువ మరియు ప్రసాదాలను అందించి ఆలయ అధికారులు ప్రత్యేక గౌరవాన్ని ప్రకటించారు.

సత్కారం పొందిన యోగా శిక్షకులు:

శ్రీ గుద్దేడి సత్యనారాయణ
శ్రీ పొన్నాడ సూరిబాబు
శ్రీ వెంటూరి సూర్యనారాయణ

ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ ముగింపు వేడుకల్లో దేవస్థాన అధికారులు డి సి బాబురావు, ఈ ఈ రామకృష్ణ, ఈ ఈ నూక రత్నం, ఏ ఈ ఓ శ్రీనివాస్, ఏఈఓ సత్య శ్రీనివాస్, ఏ ఈ ఓ జగ్గారావులతో పాటు దేవస్థానం అధికారులు మరియు దేవస్థానం స్టాఫ్ పాల్గొన్నారు.

వీరితో పాటు దేవస్థానం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్, జూనియర్ కళాశాల స్టూడెంట్స్, హై స్కూల్ స్టూడెంట్స్ మరియు సేవా సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు





**గండేపల్లి,పెన్ పవర్,జూన్,21:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా జరిగింది, అధికారులు,విద్యార్థులు, ఉపాధ్యాయులు అలాగే ఎన్ సి సి క్యాడట్స్, ఆఫీసర్స్ పాల్గొని వివిధ రకాల యోగ ఆసనాలు వేయటం జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిది గా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డా ఎమ్ శ్రీనివాస్ రెడ్డి వచ్చి ప్రతిరోజు యోగ సాధన చేయటం వల్ల ఒత్తిడిలను అదిగమించి మానసిక ప్రశాంతత పొందుకుంటామని అందువల్ల ప్రతిఒక్కరు తమ యొక్క నిత్య జీవితం లొ యోగ సాధనను అలవాటు గా మార్చుకోవాలని చెప్పటం జరిగింది,ఈ కార్యక్రమం లో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డా. ఎమ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రో వైస్ ఛాన్సెలర్ డా ఎ రమేష్,ఆదిత్య యూనివర్సిటీ రిజిస్టరర్ డా. జి సురేష్,డీన్ స్టూడెంట్ ఏఫైర్స్ డా. డి కిషోర్,మేనేజర్ హాస్టల్స్ జి.హరీష్ రెడ్డి ,ఆదిత్య యూనివర్సిటీ వ్యాయామ విభాగాధిపతి డా. ఎన్ రవి,బాయ్స్ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ పి ఎల్ ప్రసాద్ ,గర్ల్స్ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ సరిత , ఎన్ సి సి 9 ఎయిర్ వింగ్ గ్రూప్ కెప్టెన్ పి. ప్రవీణ్ బాబు , సార్జెంట్ ముకేశ్ కుమార్, వీరభద్ర,ఎ ఎన్ ఓ సబ్ లెఫ్టినెంట్ డి. నవీన్ కుమార్, అలాగే ఫిజికల్ డైరెక్టర్స్, హాస్టల్ వార్డెన్స్ పాల్గొనడం జరిగింది.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన సెయింట్ జాన్స్ పాఠశాల






**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 21:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల గ్రామంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం యోగా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిస్టర్ మేరీ కురిసేరి, సిస్టర్ రెజీనా, సిస్టర్ అబిత, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సునీత మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని పేర్కొన్నారు. విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు విద్యార్థులు చదువులో మరింత ప్రతిభ కనబరచగలరని అన్నారు.

అలాగే విద్యార్థులు పాటించాల్సిన నియమాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమయపాలన, మానసిక దృఢత్వం పెంపొందించుకునే మార్గాల గురించి వివరించారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా ఆసనాలను ప్రదర్శించగా, ఉపాధ్యాయులు వారికి యోగా విధానాలపై అవగాహన కల్పించారు. యోగా దినోత్సవ వేడుకలు పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

# ప్రియదర్శినిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు





**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 21:** ప్రియదర్శిని బాలవిహార్‌లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం ఘనంగా యోగా వేడుకలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కలకత్తాలోని రెడ్ రోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమాన్ని డిజిటల్ క్లాస్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంగా వీక్షిస్తూ, అకాడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య ఆధ్వర్యంలో యోగాసనాల అభ్యాసం, శిక్షణ, ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ యోగాసనాలను ఆకట్టుకునే రీతిలో ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అనంతరం కరస్పాండెంట్ అద్దంకి బుద్ధ చంద్రదేవ్ యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రియదర్శిని విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రద్ధగా పాల్గొని యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు.

# సంబరాలే... సంబరాలు







- **ఉత్సాహంలో తెలుగు తమ్ముళ్లు**
- **కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సంబరాలు**
- **590 కోట్ల అభివృద్ధి, సంక్షేమంతో దూసుకుపోతున్నాం - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**
- **హాజరైన జిల్లా మరియు డివిజన్ అన్ని శాఖల అధికారులు**

**గండేపల్లి, పెన్ పవర్, జూన్ 21:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జగ్గంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దాపురం ఆర్డీవో, పెద్దాపురం డి.ఎస్.పి, పిడి డో మ మధుసూదన్ రావు, అగ్రికల్చరల్ జెడి, వ్యవసాయ శాఖ ఏడి, పంచాయతీరాజ్ డిఇ, పెద్దాపురం లేబర్ ఆఫీసర్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ, ఇరిగేషన్ డి ఈ, హౌసింగ్ డి ఈ, సిడిపిఓ పూర్ణిమ, అబ్జర్వర్‌గా సలాది స్వామి నాయుడు, జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్, బిజెపి ఇన్చార్జి దాట్ల కృష్ణ వర్మ హాజరయ్యారు.

రెండేళ్లలో రూ. 589.93 కోట్ల అభివృద్ధి, సంక్షేమం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో నియోజకవర్గంలో రూ. 589,92,88,443తో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెట్టాయని తెలిపారు. ఇందులో రూ. 418.12 కోట్లు అభివృద్ధి పనులకు, రూ. 171.81 కోట్లు సంక్షేమ పథకాలకు వెచ్చించామని వివరించారు.

శాఖల వారీగా నిధుల కేటాయింపు

1. ఇరిగేషన్: రూ. 227.56 కోట్లు. మల్లవరం లిఫ్ట్‌కు రూ. 160 కోట్లు, తాళ్లూరు లిఫ్ట్‌కు రూ. 52 కోట్లు కేటాయించాం.
2. పంచాయతీ రాజ్: రూ. 121.94 కోట్లు. జజ రోడ్లకు రూ. 85.83 కోట్లు, దీ రోడ్లకు రూ. 34.24 కోట్లు ఖర్చు చేశాం.
3. =డదీ: రోడ్లు, భవనాలకు రూ. 46 కోట్లు.
4. వైద్య, ఆరోగ్యం: రూ. 19.33 కోట్లు. జఎజ, ౯ాఎజలకు రూ. 9.9 కోట్లు, విలేజ్ క్లినిక్స్‌కు రూ. 9.43 కోట్లు.
5. విద్యుత్ సింగరంపాలెం సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ. 3.29 కోట్లు.
6. 85 కోట్లతో సిమెంట్ రోడ్లు
7. 32 కోట్లతో తారు రోడ్లు,

మూడు స్తంభాల పాలనతో ఏపీ పురోగతి

సీఎం చంద్రబాబు విజన్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోరాటం, మంత్రి నారా లోకేష్ దూకుడుతో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టిందని నెహ్రూ అన్నారు. గత జగన్ అరాచక పాలనలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దుతున్నామని తెలిపారు.

రాబోయే మూడేళ్ల రోడ్‌మ్యాప్

రోడ్లు, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రెండేళ్లలో ఇంత చేస్తే ఐదేళ్లలో రాష్ట్ర రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వ శాఖల స్టాల్స్, యోగా కార్యక్రమం

కార్యక్రమం ప్రారంభానికి ముందు వ్యవసాయం, వెలుగు, అంగన్‌వాడీ, విద్యాశాఖ, ఉపాధి హామీ, ఏపీఎస్ఆర్టీసీ,ఉద్యానవన శాఖల స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి యోగానంద కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సభకు పెద్దాపురం ఆర్డీవో, డీఎస్పీ, జిల్లాస్థాయి అధికారులు, అన్ని శాఖల అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అధికారులు ఆయా శాఖల పనితీరును సవివరంగా వివరించారు. ఇది పూర్తిగా ప్రభుత్వ కార్యక్రమమని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి మండల అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, వివిధ ప్రాజెక్ట్ల చైర్మన్లు, జిల్లా రాష్ట్రస్థాయి కూటమి నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు ప్రభుత్వ అధికారులు, నాలుగు మండలాల ఎంపీడీవోలు, పాల్గొన్నారు.



# ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు








**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 21:**ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని, నేడు ప్రపంచ దేశాల ప్రజలందరూ యోగాను ఆచరిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు.వశిష్ట గౌతమి పిరమిడ్ కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఆర్డీఓ జి.వి.వి. సత్యనారాయణ, డీఎస్పీ సుంకర మురళీకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆకుల రామకృష్ణ, ముళ్లపూడి భాస్కరరావు, కుసంపూడి రామకృష్ణరాజుతో కలిసి పాల్గొని యోగాసనాలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుభాష్ పత్రీజీ ఆశీస్సులతో ఆయన శిష్యబృందం ఈ ప్రాంతానికి గొప్ప పిరమిడ్ కేంద్రాన్ని నిర్మించి అందించడం గర్వకారణమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఇక్కడ నిర్వహించడం ప్రశంసనీయమని తెలిపారు.యోగ, ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం లభిస్తాయని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న మానసిక ఒత్తిడులను అధిగమించాలన్నా, మనసును నియంత్రించాలన్నా యోగా తప్పనిసరని అన్నారు.

యోగాను కేవలం ఒక రోజు చేసే వ్యాయామంగా కాకుండా, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యోగాను ప్రజల్లో విస్తృతంగా ప్రోత్సహించారని తెలిపారు. ముఖ్యంగా ప్రధాని మోదీ యోగాపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.విశ్వంలోని సహజశక్తిని పిరమిడ్ ద్వారా పొందవచ్చని, పిరమిడ్‌లో ధ్యానం చేయడం వల్ల శరీరానికి, మనసుకు మరింత శక్తి లభిస్తుందని చెప్పారు.రాబోయే పుష్కరాలను పురస్కరించుకుని వచ్చే ఏడాది జిల్లా కలెక్టర్, అధికారులతో చర్చించి జిల్లా స్థాయి యోగా కార్యక్రమాన్ని వశిష్ట పిరమిడ్ కేంద్రం వద్ద నిర్వహించేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే పిరమిడ్ కేంద్రం అభివృద్ధికి, ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు.

# ఏడు వారాల వెంకన్న దర్శనానికి భక్తుల రద్దీ





**నిత్య అన్నదాన పథకానికి రూ.50,116 విరాళం**

**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 22:**ఏడు వారాల వెంకన్న దర్శనానికి వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం స్వామివారి సన్నిధిలో అష్టోత్తరం, నిత్య కళ్యాణం తదితర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు ఉదారంగా విరాళాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం దానవాయిపేటకు చెందిన నిడిముక్కల శ్రీదేవి, పిల్లుట్ల రవికుమార్ కుటుంబ సభ్యులు నిత్య అన్నదాన పథకానికి రూ.50,116 విరాళంగా సమర్పించారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. భక్తుల సహకారంతో నిత్య అన్నదాన పథకం విజయవంతంగా కొనసాగుతోందని ఆలయ అధికారులు తెలిపారు. యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం విశేషంగా నిలుస్తోంది

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కాకినాడలో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 21:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడలో జిల్లా స్థాయి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆయుష్ శాఖ, క్రీడా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఇండోర్ స్టేడియం, జేఎన్టీయూ కాకినాడ ఇండోర్ స్టేడియంలలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమాల్లో సుమారు 1,780 మంది పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది యోగా గురువులు కామన్ యోగా ప్రోటోకాల్ ప్రకారం యోగా సాధన నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్,ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరు ఏవీఎస్ సూర్యనారాయణ రాజు,జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా పరిషత్ సీఈఓ వివిఎస్ లక్ష్మణరావు, పెద్దాపురం ఆర్డీవో పి.కృష్ణమూర్తి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథులు తొలుత పతంజలి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యోగాచార్యులు రాఘవానంద, బ్రహ్మకుమారి దీదీలు పాల్గొన్న వారితో యోగాసనాలు, ప్రాణాయామం,ధ్యాన సాధన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ,నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యవంతమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు, సమతుల్య జీవన విధానాన్ని అందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ముఖ్యంగా వృద్ధాప్య దశలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి,జీవన నాణ్యతను మెరుగుపరచుకోవడానికి యోగా అత్యంత ఉపయోగకరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ యోగాకు భారతదేశం పుట్టినిల్లని, యోగ సాధన ద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఉద్యమంలా నిర్వహిస్తున్నామని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యోగాను నిత్యం ఆచరిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరు ఏవీఎస్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అపురూప కానుక అని పేర్కొన్నారు. యోగాను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంలో భారతదేశం విశిష్ట పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో యోగాంధ్ర-2026 రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కాకినాడకు చెందిన వేదుల శ్రీకృష్ణ ఫణీంద్రను జిల్లా కలెక్టర్ అభినందించారు. అలాగే చిన్నారులు ఆర్. చైత్ర శివ వాసుకి,ఐ.ఎరిక్, కె. మిధున ప్రదర్శించిన నృత్య యోగా విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఎంఎస్ అలీ,మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, మహిళలు, యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యోగా సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యోగా.. ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలి-: డాక్టర్ అడ్డాల



**కాకినాడ, పెన్ పవర్ జూన్ 21:** ప్రపంచానికి భారతదేశం అందించిన యోగా అనే అమూల్యమైన సంపదను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవడమే అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క అసలైన లక్ష్యమని ప్రముఖ దంత వైద్యులు డా. అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వాగ్దేవి నృత్య పాఠశాలలో విద్యార్థులతో కలిసి డా.అడ్డాల సత్యనారాయణ యోగాసనాలు, ప్రాణాయామం సాధన చేశారు. అనంతరం విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014 సెప్టెంబర్ 27న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతిపాదనను ముందుకు తెచ్చారని గుర్తు చేశారు. ఆ ప్రతిపాదనకు కేవలం 75 రోజుల్లోనే 177 దేశాల మద్దతు లభించడంతో, 2014 డిసెంబర్ 11న ఐక్యరాజ్యసమితి అధికారికంగాఆమోదించిందన్నారు. అనంతరం 2015 జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారని తెలిపారు. జూన్ 21 సంవత్సరంలో అత్యంత పొడవైన రోజు కావడంతో పాటు ప్రకృతితో మానవుడి అనుబంధాన్ని గుర్తు చేసే ప్రత్యేకమైన రోజని పేర్కొన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం, జీవనం కోసం యోగా" అని తెలిపారు. యోగా మనస్సులోని చంచలత్వాన్ని నియంత్రించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని డా. అడ్డాల అన్నారు. క్రమం తప్పకుండా యోగాసనాలు, ప్రాణాయామం చేయడం వల్ల శరీరానికి బలం, లీనత పెరగడంతో పాటు రక్తప్రసరణ మెరుగై గుండె జబ్బుల ముప్పు తగ్గుతుందన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి, ఆందోళనలను తగ్గించి మనస్సుకు ప్రశాంతతను అందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అలాగే యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం వృద్ధి చెందుతాయని వివరించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాభ్యాసానికి కేటాయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తేజేశ్వరరావు, వాగ్దేవి నృత్య పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవన విధానం యోగాతోనే సాధ్యం.



- ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం..

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 21:**ఆరోగ్యంవంతమైన జీవన విధానం యోగాతోనే సాధ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని,ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని ఆమె సూచించారు. ఆరోగ్యకర జీవనానికి యోగానే మార్గమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ,రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ,ఎంపీపీ గంటిమల్ల రాజ్యలక్ష్మి,నాయకులు యాళ్ల విశ్వేశ్వరరావు,సుంకర సోమరాజు,మంతెన వెంకటరమణ,జువ్విన తిరుపతిరావు,అడ్డాల త్రిమూర్తులు,పెంటకోట మోహన్,పోలిశెట్టి శ్రీనివాస్,గోపిశెట్టి శ్రీను,మదినే దొరబాబు,గాబు సుభాష్,తలపంటి బుజ్జి,కంచిబోయిన శ్రీను,మెల్లిపాక నాగబాబు,ప్రత్తిపాడు ఎంపిడీఓ ఎంవిఆర్ కుమార్ బాబు,ఎంఈఓ వి రాజబాబు,సిడిపిఓ పద్మావతి, నియోజకవర్గంలోని వివిధ శాఖలఅధికారులు,పలువురుకూటమి నాయకులు, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచవ్యాప్తంగా యోగాకు ప్రేరణ ప్రధాని మోదీ కృషి: పాలూరి సత్యానందం



**పెన్ పవర్ కొత్తపేట, జూన్ 21:**ప్రపంచవ్యాప్తంగా యోగాపట్ల ప్రజల్లో అవగాహన, ప్రేరణ పెరగడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషి ప్రధాన కారణమని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొత్తపేట ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ కోనసీమ బౌద్ధ ప్రముఖ్ తోగరు ఆంజనేయులు, బసవరాజు ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. అనంతరం యోగా ప్రాధాన్యతను వివరించారు.

ఈ సందర్భంగా పాలూరి సత్యానందం మాట్లాడుతూ యోగ అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మనస్సు, శరీరం, ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే జీవన విధానమని అన్నారు. యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసాన్ని సాధించవచ్చని తెలిపారు.

ప్రపంచానికి యోగా విశిష్టతను పరిచయం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ కృషి వల్లే అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడుతోందని చెప్పారు. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర యువమోర్చా నాయకులు పాలూరి జయప్రకాశ్ నారాయణ, జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్, కిసాన్ మోర్చా నాయకులు ఉద్దరాజు ప్రసాద్‌రాజు, అంజిబాబు, అరిగేల రమేష్, అన్యం సత్యనారాయణ, శ్రీగ్రాకోలాపు భీమేశ్వరరావు, సాయి బలరాం, బొరుసు లక్ష్మణరావు, బొరుసు భద్రం తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 21:** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ సంస్థ, కాకినాడ ప్రధాన నిర్వహణలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్,యూత్ క్లబ్ సభ్యుల సహకారంతో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీనగర్ పార్కులో ఉదయం 7 గంటల నుంచి నిర్వహించిన యోగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు,వాకర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన జీవన విధానంలో యోగా పాత్రపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక యోగా ప్రదర్శన నిర్వహించి,యోగా ద్వారా శారీరక దృఢత్వం,మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవాలని సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, కాకినాడ మాజీ మేయర్ తిరుమల పావని, బీజేపీ నాయకులు మాల కొండయ్య, యోగా మాస్టర్ సురేష్ మరియు ఆయన బృందం పాల్గొన్నారు. అలాగే మై భారత్ సిబ్బంది ఎం. ప్రకాష్, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ,యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

## కాకినాడ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన రీ-నీట్ పరీక్ష-90.02 శాతం హాజరు నమోదు






**కాకినాడ, పెన్ పవర్,జూన్ 21:** కాకినాడ జిల్లాలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి రీ-నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని 11 పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్ష విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్, జేఎన్టీయూకేలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను అధికారులతో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్లతో మాట్లాడి పరీక్ష నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన నీట్ పరీక్షకు సంబంధించిన వివాదాల నేపథ్యంలో రీ-నీట్ పరీక్షను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. రెవెన్యూ, పోలీసు తదితర శాఖల సమన్వయంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, పరీక్షార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరిగిన రీ-నీట్ పరీక్షకు మొత్తం 3,232 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 2,922 మంది హాజరయ్యారని, 310 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 90.02 శాతం హాజరు నమోదైందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పరీక్షా సిబ్బంది సహకారంతో రీ-నీట్ పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు.

## వేగులమ్మ అమ్మవారి ని దర్శించుకున్న ప్రత్తిపాడు కాంగ్రెస్ ఇంచార్జ్ ఉమ్మిడి.





ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 21: ఏలేశ్వరం మున్సిపాలిటీ పరిధిలో అప్పన్నపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వేగులమ్మ అమ్మవారి ని ప్రతిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఆదివారం దర్శించుకున్నారు. గ్రామం లో వేగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ దేవతలను నిర్ణీత కాలంలో ప్రతి యేటా నిర్వహించడం, ప్రజలందరూ కులమతాలకు అతీతంగా పాల్గొనడంతో పండగ వాతావరణం ఏర్పడుతుందన్నారు. సమాజంలో సుహృద్భావ వాతావరణం ఏర్పడడం, నిత్యం పనులతో బిజీగా ఉండే కార్మిక వర్గానికి ఇటువంటి పండగలు, జాతర్లు ఎంతో నూతన ఉత్సాహాన్ని కలగజేస్తాయి అన్నారు.

ఈ కార్యక్రమంలో అప్పన్నపాలెం గ్రామ పెద్దలు చింతల పాండవులు, దొంతం శెట్టి చంద్రశేఖర్, గూనాపు నాగ శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి వీరబాబు , గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం,రైతుల అంశాలపై విద్యార్థులకు పోటీలు




**ఏలూరు జూన్ 21పెన్ పవర్:** జులై 3,4,5 తేదీల్లో ఏలూరులో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభల సందర్భంగా జూన్ 30, జులై 1వ తేదీల్లో ఏలూరులోని సాహిత్య మండలిలో విద్యార్థినీ, విద్యార్థులకు ఉపన్యాసం, చిత్రలేఖనం,సామెతలు,నినాదాలు,ఏకపాత్రాభినయం, కోలాటం,నృత్య ప్రదర్శనలు వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు మహాసభ ఆహ్వాన సంఘం నాయకులు వెల్లడించారు.విద్యార్థుల పోటీలకు సంబంధించిన ఫ్లెక్సీలను, కరపత్రాలను ఏలూరు పవర్ పేటలోని ఉద్దరాజు రామం భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు బి. బలరాం, వివిధ సంఘాల నాయకులు ఆదివారం ఆవిష్కరించారు.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన బి.బలరాం మాట్లాడుతూ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అందుకు విద్యాలయాల వారు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు నగరం పరిసర ప్రాంతాల హైస్కూల్,కాలేజీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జులై 3,4,5 తేదీల్లో విద్యార్థులు,కవులు.కళాకారులను రైతులు, వ్యవసాయ రంగానికి సంబంధించి విషయాలపై అవగాహన పోటీలు కార్యక్రమం తలపెట్టామని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విద్యార్థులకు విద్యాలయాల వారికి విజ్ఞప్తి చేశారు. ఏలూరు చుట్టుపక్కల 70 స్కూల్స్ కాలేజీల్లో సోషల్ మీడియా,కరపత్రాలు, బ్యానర్ల ద్వారా 50వేల మంది విద్యార్థులకు ప్రచారం జరుగుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు నగరం పరిసర ప్రాంతాల్లోని విద్యాలయాల వారు ఆరు అంశాలలో విద్యార్థులను పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు.ఆర్టిస్టులు కళాకారులు కూడా ప్రతిభా ప్రదర్శనలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. గత 90 ఏళ్ళుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందన్నారు. దేశానికి తిండి గింజలు అందిస్తున్న వ్యవసాయం నేడు సంక్షోభంలో ఉందని, రైతులు నష్టాల్లో ఉన్నారని ఈ పరిస్థితుల్లో వ్యవసాయరంగ పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కోన శ్రీనివాసరావు, బొడ్డు రాంబాబు,సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు,శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ఎం.నాగమణి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ మరియు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 30న రైతుల సమస్యలపై మహాధర్నా




సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య

**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూన్ 21;**పొగాకు రైతులు, పామాయిల్ రైతులు, మొక్కజొన్న మరియు వేరుశనగ తదితర పంటల పండించే రైతుల సమస్యలపై జూన్ 30వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మహా ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు.

ఆదివారం అంకంపాలెంలో సిపిఐ మండల సమితి సమావేశం కొప్పుల నాగరాజు అధ్యక్షతన జరిగింది. సిపిఐ మండల కార్యదర్శి కారం దారయ్య మండలంలో సిపిఐ కార్యకలాపాలను వివరించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు.గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచడం వల్ల అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరలు నియంత్రణకు సిపిఐ నిర్వహించే పోరాటాలలో, ఆందోళనలలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై స్థానిక సమస్యలపై ఆగస్టు 6 నుండి 16 వరకు ప్రసార ఆందోళన కార్యక్రమం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వి ఎస్ ఎస్ ల అభివృద్ధికి, సక్రమంగా పనిచేయుటకు విఎస్ఎస్ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమితిసమావేశంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు జేవి రమణరాజు సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఓర్సు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం లేక రైతుల ఆవేదన



**ఎటపాక, పెన్ పవర్ జూన్ 21:** పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం లేకపోవడంతో పాటు ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్ కాకపోవడం వల్ల గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎటపాక మండలం కుసుమనపల్లి గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో వారు తమ సమస్యలను వెల్లడించారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ సీడింగ్ లేకపోవడం, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం కాకపోవడం వల్ల రైతు భరోసా, పీఎం-కిసాన్, పంట రుణాలు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు, ఎరువుల సబ్సిడీలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదని వాపోయారు. భూమి రికార్డులు, ఆధార్ వివరాలు ఆన్‌లైన్‌లో సరిపోలకపోవడంతో ప్రభుత్వ పోర్టల్లలో సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు నష్టపోతున్నారని తెలిపారు.

గత 40 సంవత్సరాలుగా తమ భూములపై హక్కులు కలిగి ఉండి పంట రుణాలు, ఎరువులు, సబ్సిడీలు పొందుతున్నామని, అయితే మధ్యలోనే సేవలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. గతంలో అందుతున్న సౌకర్యాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

పోలవరం జిల్లా ఏర్పాటైన తర్వాత భూ రికార్డుల మార్పులు, ఆన్‌లైన్ సాంకేతిక సమస్యల కారణంగా పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం నిలిచిపోయిందని రైతులు ఆరోపించారు. దీంతో అనేక మంది రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి దూరమవుతుండగా, వ్యవసాయ అవసరాల కోసం రుణాలు పొందడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో పూసం రాఘవయ్య, సున్నం బొజ్జి, పూసం నాగేశ్వరరావు, కోర్సా రాజయ్య, ఐరోపా సత్తెమ్మ, తాటి శ్రీనివాస్, ఐరోపా బాలరాజు, చందు, పూసం అన్నారావు, కుంజా పండు తదితర గిరిజన రైతులు పాల్గొన్నారు.

## సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### 150 మందికి వైద్య సేవలు -- అన్నదానం నిర్వహణ







**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 21:**

రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ పావని ప్రియ రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు, చికిత్స అందించారు. అలాగే 45 మందికి రక్త పరీక్షలు, 4 మందికి థైరాయిడ్ పరీక్షలు, 8 మందికి ఎక్స్‌రేలు, 14 మందికి ఫిజియోథెరపీ సేవలు నిర్వహించినట్లు తెలిపారు.వైద్య శిబిరానికి హాజరైన రోగులు, వారి సహాయకులకు అన్నదానం కూడా నిర్వహించినట్లు స్వామీజీ వెల్లడించారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్య సేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# మోదుకూరులో ఘనంగా యోగా దినోత్సవం







**150 మందితో సామూహిక యోగాభ్యాసం**

**యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని పిలుపు**

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 21;**అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలమూరు మండలం మోదుకూరు గ్రామంలో శనివారం ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, అంబేద్కర్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చంద్రు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది గ్రామస్తులు, యువత, మహిళలు పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో రాజు, వ్యవసాయ శాఖ ఏడీ సి.హెచ్.కె.వి. చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని, నేటి కాలంలో ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యోగా, ధ్యానం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. నేటి జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని అధిగమించడానికి, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతిరోజూ అభ్యసించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, ఏకాగ్రత పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా యోగ గురువు బి. మణికుమార్ పాల్గొని పలువురు యోగాసనాలను ప్రదర్శించారు. యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్యపరమైన ప్రయోజనాలను వివరించి, ప్రతిరోజూ కొంత సమయం యోగాభ్యాసానికి కేటాయించాలని సూచించారు. యోగా ద్వారా శరీరానికి, మనసుకు సమతుల్యత లభిస్తుందని తెలిపారు. యోగా పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొని యోగా ప్రాధాన్యతను చాటిచెప్పారు. పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు అభినందనలు తెలియజేశారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# బాల మందిరం ఆధ్వర్యంలో యోగా, మెడిటేషన్ లలో శిక్షణ

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 21;**బాల మందిరంలో ప్రతి వారం జరుపుకునే బాలల సభ ఆదివారం సాయంత్రం సంధిపూడిలో బాలల ఆనందోత్సవాల నడుమ జరిగింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు యోగా, మెడిటేషన్ లలో శిక్షణ పొందారు.

ఆదివారం జరిగిన జాతీయ పఠన వారోత్సవాలలో భాగంగా బాల బాలికలు బాల సాహిత్యం పుస్తకాలను అవగాహన తో చదివారు. సంగీత దినోత్సవం సందర్భంగా దేశభక్తి గేయాలను సుస్వరంగా ఆలపించారు.కాన్సన్ ట్రేషన్ గేమ్ క్రీడా స్ఫూర్తి తో ఆడారు.నీతి పద్యాలు, శ్లోకాలను విద్యార్థులు చదివారు. ఆటలు, పాటలు, పఠనం అంశాలలో గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



## పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం లేక రైతుల ఆవేదన



**ఎటపాక, పెన్ పవర్ జూన్ 21:** పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం లేకపోవడంతో పాటు ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్ కాకపోవడం వల్ల గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎటపాక మండలం కుసుమనపల్లి గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో వారు తమ సమస్యలను వెల్లడించారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ సీడింగ్ లేకపోవడం, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం కాకపోవడం వల్ల రైతు భరోసా, పీఎం–కిసాన్, పంట రుణాలు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు, ఎరువుల సబ్సిడీలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదని వాపోయారు. భూమి రికార్డులు, ఆధార్ వివరాలు ఆన్‌లైన్‌లో సరిపోలకపోవడంతో ప్రభుత్వ పోర్టళ్లలో సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు నష్టపోతున్నారని తెలిపారు.

గత 40 సంవత్సరాలుగా తమ భూములపై హక్కులు కలిగి ఉండి పంట రుణాలు, ఎరువులు, సబ్సిడీలు పొందుతున్నామని, అయితే మధ్యలోనే సేవలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. గతంలో అందుతున్న సౌకర్యాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

పోలవరం జిల్లా ఏర్పాటైన తర్వాత భూ రికార్డుల మార్పులు, ఆన్‌లైన్ సాంకేతిక సమస్యల కారణంగా పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం నిలిచిపోయిందని రైతులు ఆరోపించారు. దీంతో అనేక మంది రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి దూరమవుతుండగా, వ్యవసాయ అవసరాల కోసం రుణాలు పొందడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో పూసం రాఘవయ్య, సున్నం బొజ్జి, పూసం నాగేశ్వరరావు, కోర్సా రాజయ్య, ఐరోపా సత్తెమ్మ, తాటి శ్రీనివాస్, ఐరోపా బాలరాజు, చందు, పూసం అన్నారావు, కుంజా పండు తదితర గిరిజన రైతులు పాల్గొన్నారు.

## 30న రైతుల సమస్యలపై మహాధర్నా




**సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య**

**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూన్ 21;**పొగాకు రైతులు, పామాయిల్ రైతులు, మొక్కజొన్న మరియు వేరుశనగ తదితర పంటల పండించే రైతుల సమస్యలపై జూన్ 30వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మహా ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు.

ఆదివారం అంకంపాలెంలో సిపిఐ మండల సమితి సమావేశం కొప్పుల నాగరాజు అధ్యక్షతన జరిగింది. సిపిఐ మండల కార్యదర్శి కారం దారయ్య మండలంలో సిపిఐ కార్యకలాపాలను వివరించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు.గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచడం వల్ల అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరలు నియంత్రణకు సిపిఐ నిర్వహించే పోరాటాలలో, ఆందోళనలలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు.


కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై స్థానిక సమస్యలపై ఆగస్టు 6 నుండి 16 వరకు ప్రసార ఆందోళన కార్యక్రమం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వి ఎస్ ఎస్ ల అభివృద్ధికి, సక్రమంగా పనిచేయుటకు విఎస్ఎస్ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమితిసమావేశంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు జేవి రమణరాజు సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఓర్సు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అతివేగం బలి తీసుకుంది..

నీట్ పరీక్ష రాసి వస్తుండగా యువకుడి మృతి, యువతికి తీవ్ర గాయాలు






**కాజులూరు, పెన్ పవర్, జూన్ 21:** ఓ కుటుంబంలో ఆనందంగా ముగియాల్సిన రోజు విషాదంగా మారింది. నీట్ పరీక్ష రాసి స్వగ్రామానికి తిరిగి వస్తున్న సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతనితో పాటు ప్రయాణిస్తున్న యువతి తీవ్రంగా గాయపడింది. ఈ విషాద ఘటన కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం పాతర్లగడ్డ గ్రామానికి చెందిన పెండుం సుధీర్ కుమార్ (30) తన బంధువైన మాదుర శ్రీవల్లిని నీట్ పరీక్ష కోసం రాజమహేంద్రవరానికి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. పరీక్ష ముగిసిన అనంతరం ఇద్దరూ తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు.సాయంత్రం సమయంలో గొల్లపాలెం గ్రామంలోని తిరుమల ఫంక్షన్ హాల్ ఎదురుగా కాకినాడ--కోటిపల్లి ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను వారి బైక్ ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావానికి బైక్ గాల్లోకి ఎగిరి పల్టీలు కొట్టగా, బైక్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డుపై బలంగా పడ్డారు.ఈ ప్రమాదంలో సుధీర్ కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మరోవైపు యువతి మాధుర శ్రీవల్లికి తీవ్ర గాయాలు కాగా, ముఖ్యంగా కాలు విరిగినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన యువతిని సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించాలని వైద్యులు సూచించినట్లు సమాచారం.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు గొల్లపాలెం పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటన మరోసారి రహదారులపై అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ఎంతటి విషాదాలకు కారణమవుతుందో గుర్తు చేసింది. ఒక యువకుడి ప్రాణం కోల్పోవడంతో పాటు, భవిష్యత్తు కోసం పరీక్ష రాసి వస్తున్న యువతి ఆసుపత్రి పాలవడం స్థానికులను కలచివేసింది. కుటుంబ సభ్యుల రోదనలు చూసిన వారందరి హృదయాలను కదిలించాయి.

# టీ20 క్రికెట్‌లో కొత్త రారాజు.. గేల్ ను అధిగమించిన పొలార్డ్

- టీ20 క్రికెట్‌లో క్రిస్ గేల్ రికార్డును బద్దలుకొట్టిన కీరన్ పొలార్డ్
- మేజర్ లీగ్ క్రికెట్‌లో సెంచరీతో ఈ ఘనత సాధించిన విండీస్ ఆల్‌రౌండర్
- 14,562 పరుగుల గేల్ రికార్డును దాటి 14,582 పరుగులతో అగ్రస్థానానికి
- పదేళ్లకు పైగా అగ్రస్థానంలో కొనసాగిన గేల్ ఆధిపత్యానికి ముగింపు
- టీ20ల్లో 10,000 పరుగులు, 300 వికెట్లు తీసిన ఏకైక ఆటగాడిగా రికార్డ్



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ విధ్వంసకర ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటివరకు ఈ రికార్డును తన పేరిట ఉంచుకున్న సహచర ఆటగాడు క్రిస్ గేల్‌ను పొలార్డ్ అధిగమించాడు. మేజర్ లీగ్ క్రికెట్ (మీజ) 2026 సీజన్‌లో భాగంగా ఆదివారం ఈ ఘనత సాధించాడు.

డల్లాస్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ తరఫున ఆడిన పొలార్డ్, అజేయ శతకంతో (100ి పరుగులు, 56 బంతుల్లో) చెలరేగాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను టీ20ల్లో తన మొత్తం పరుగుల సంఖ్యను 14,582కు పెంచుకున్నాడు. దీంతో, 14,562 పరుగులతో పదేళ్లకు పైగా (4,463 రోజులు) అగ్రస్థానంలో ఉన్న క్రిస్ గేల్ రికార్డు బద్దలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు 245 పరుగులు చేయగా, పొలార్డ్ సెంచరీ చేసినప్పటికీ ఎంఐ న్యూయార్క్ 215 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది. 39 ఏళ్ల పొలార్డ్ తన సుదీర్ఘ కెరీర్‌లో 736 టీ20 మ్యాచ్‌లు ఆడి ఈ మైలురాయిని చేరుకున్నాడు. టీ20 క్రికెట్‌లో 10,000కు పైగా పరుగులు, 300కు పైగా వికెట్లు పడగొట్టిన ఏకైక ఆటగాడిగానూ అతనికి అరుదైన రికార్డు ఉంది. ఎక్కువగా ఫినిషర్ పాత్ర పోషించే అతను, నెం.5 లేదా ఆ తర్వాతి స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చి 10,000కు పైగా పరుగులు చేయడం విశేషం. ఈ వయసులోనూ అత్యున్నత స్థాయిలో రాణిస్తూ పొలార్డ్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

**టీ20 క్రికెట్‌లో పరుగుల వీరులు వీళ్లే..**

కీరన్ పొలార్డ్: 14,582 పరుగులు (736 మ్యాచ్‌లు)
క్రిస్ గేల్: 14,562 పరుగులు (463 మ్యాచ్‌లు)
అలెక్స్ హెల్స్: 14,449 పరుగులు (528 మ్యాచ్‌లు)
జాస్ బట్లర్: 14,371 పరుగులు (510 మ్యాచ్‌లు)
డేవిడ్ వార్నర్: 14,284 పరుగులు (439 మ్యాచ్‌లు)
విరాట్ కోహ్లీ: 14,218 పరుగులు (430 మ్యాచ్‌లు)

# వరల్డ్ కప్‌లో భారత్ మహిళలకు తొలి ఓటమి.. 6 వికెట్ల తేడాతో సౌతాఫ్రికా విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమెన్స్ టి20 వరల్డ్ కప్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత మహిళల జట్టుకు సౌతాఫ్రికా గట్టి బ్రేక్ వేసింది. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరిగిన హై-వోల్టేజ్ పోరులో భారత్‌పై దక్షిణాఫ్రికా మహిళల టీమ్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో టీమిండియాకు ఇదే మొదటి ఓటమి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. ఓపెనర్ షఫాలీ వర్మ, ఆల్ రౌండర్ దీప్తి శర్మలు రాణించడంతో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. అనంతరం 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా.. మరో 5 బంతులు మిగిలి ఉండగానే టార్గెట్‌ను ఛేదించి విజయాన్ని అందుకుంది.

**మొదట్లో సౌతాఫ్రికాకు షాక్ ఇచ్చిన శ్రీచరణి:**

159 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా బ్యాటర్లను మన తెలుగమ్మాయి శ్రీచరణి ఆరంభంలోనే గట్టి దెబ్బ కొట్టింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (20) దూకుడుగా ఆడుతున్న క్రమంలో శ్రీచరణి తన స్పిన్ మ్యాజిక్‌తో క్యాచ్ అవుట్ చేసింది. ఆ వెంటనే క్రీజులోకి వచ్చిన అన్నరీ డెర్క్‌సెన్‌ను కూడా డకౌట్ చేసి పంపించింది. ఇలా వరుసగా రెండు వికెట్లు తీసి సౌతాఫ్రికాను కష్టాల్లోకి నెట్టింది.

**మారిజన్ కాప్, తజ్మిన్ బ్రిట్స్ దండయాత్ర:**

కష్టాల్లో పడిన సౌతాఫ్రికా జట్టును ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్, స్టార్ ఆల్ రౌండర్ మరిజానే కాప్ ఆదుకున్నారు. భారత బౌలింగ్‌ను టార్గెట్ చేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. అరుంధతి రెడ్డి, శ్రీచరణి, ప్రేమ్ రావత్, నందని శర్మల ఓవర్లలో ఈ ఇద్దరు వన్-సైడ్ రచ్చ లేపారు. వీరిద్దరి మధ్య నెలకొన్న 97 పరుగుల భారీ భాగస్వామ్యానికి ఆఖర్లో షఫాలీ వర్మ బ్రేక్ వేసింది. హాఫ్ సెంచరీ వైపు దూసుకెళ్తున్న తజ్మిన్ బ్రిట్స్ (40) ను షఫాలీ అవుట్ చేసినప్పటికీ.. అప్పటికే మ్యాచ్ భారత్ చేతుల్లోంచి చేజారిపోయింది.

**మ్యాచ్ ఫినిష్ చేసిన మారిజన్ కాప్:**

తజ్మిన్ బ్రిట్స్ అవుట్ అయినప్పటికీ.. క్రీజులో పాతుకుపోయిన మారిజన్ కాప్ ఏమాత్రం తగ్గలేదు.. సెంచరీ దిశగా దూసుకెళ్తూ ఒంటిచేత్తో మ్యాచ్‌ను ముందుకు నడిపించింది. భారత బౌలర్లకు ఎలాంటి ఛాన్స్ ఇవ్వకుండా 81 పరుగులతో అజేయంగా నిలిచి సౌతాఫ్రికాకు ఘన విజయాన్ని అందించింది. భారత బౌలర్లలో శ్రీచరణి 3 వికెట్లు తీయగా, షఫాలీ వర్మ ఒక వికెట్ దక్కించుకుంది.

# వరల్డ్ కప్‌లో ఒకే ఒక్కడు.. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన గోల్ కీపర్‌గా జర్మనీ ప్లేయర్ రికార్డు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా వరల్డ్ కప్ 2026 లో జర్మనీ ప్లేయర్ మాన్యుయెల్ న్యూయెర్ రికార్డు సృష్టించాడు. ప్రపంచ కప్ లో అత్యధిక మ్యాచ్ లు ఆడిన ఫ్రాన్స్ ప్లేయర్ హ్యూగో లోరిస్‌ను అధిగమించాడు. ఐవరీ కోస్ట్‌తో జరిగిన గ్రూప్ జు పోరులో 21వ మ్యాచ్ ఆడి, ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక మ్యాచ్ లలో ఆడిన గోల్ కీపర్ గా ఈ ఘనత సాధించాడు. 20 ప్రపంచ కప్ మ్యాచ్‌లలో ఆడిన హ్యూగో లోరిస్‌ను న్యూయెర్ అధిగమించాడు. దీంతో గ్లోబల్ స్టేజ్ లో గోల్ కీపర్‌లకు సిరికొత్త బెంచ్ మార్క్ ను . ఇదే మ్యాచ్ లో ఐవరీ కోస్ట్ ఆటగాడు ఫ్రాంక్ కెస్సీ.. 30 నిమిషంలో గోల్ చేసీ లెగసీని కొనసాగించాడు.ఆప్టా ప్రకారం, 29 సంవత్సరాల 183 రోజుల వయస్సులో ఐవరీ కోస్ట్ తరఫున గోల్ చేసిన కెస్సీ.. ఈ ఏజ్ లో ఘనత సాధించిన ప్రపంచ కప్ చరిత్రలో రెండవ అతి పెద్ద ఆటగాడిగా నిలిచాడు. కెస్సీకి ముందు డిడియర్ ద్రోగ్బా ఉన్నాడు. 2010లో 32 సంవత్సరాల 101 రోజుల వయస్సులో గోల్ చేసి.. అతి పెద్ద వయసులో గోల్ చేసిన ఆటగాడిగా డిడియర్ ద్రోగ్బా ఫస్ట్ ప్లేస్లో ఉన్నాడు. 2026 ఫీఫా ప్రపంచ కప్ ముగిసిన తర్వాత రిటైర్ అవుతానని ఐవరీ కోస్ట్‌తో జరిగే మ్యాచ్‌కు ముందు ప్రకటించాడు

# వరుస అనౌన్స్మెంట్స్ ఓకే.. మరి ఇప్పటికైనా గాడిన పడతారా?







మాస్ మహారాజా రవితేజ అంటేనే ఫుల్ ఎనర్జీ.. వరుస సినిమాలతో దూసుకుపోవడం ఆయన స్టైల్. అయితే గత కొంతకాలంగా ఆయనకు బాక్సాఫీస్ వద్ద సరైన సక్సెస్ పడటం లేదు. ఈ నేపథ్యంలోనే మళ్లీ పాత స్పీడ్ అందుకోవడానికి రవితేజ కేవలం రెండు నెలల గ్యాప్‌లోనే రెండు భారీ ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు రెడీ అవుతున్నారు. ఒక క్రేజీ నిర్మాతతో, మరో విలక్షణ దర్శకుడితో రాబోతున్న ఈ సినిమాలు ఆయన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తెస్తాయని ఫాన్స్ గట్టిగ నమ్ముతున్నారు ..మరి ఆ విశేషాలు చూద్దాం..

**దిల్ రాజు బ్యానర్‌లో మాస్ జాతర:**

సినీ వర్గాల సమాచారం ప్రకారం.. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మాణంలో రవితేజ చేయబోయే కొత్త సినిమా షూటింగ్ వచ్చే ఆగస్టు నుంచి ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు, నటీనటుల ఎంపిక వేగంగా జరుగుతున్నాయి. రవితేజను అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో.. దానికి తగ్గట్టుగా ఒక పక్కా కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను సిద్ధం చేసినట్లు ఇండస్ట్రీలో గట్టిగా టాక్ వినిపిస్తోంది.

**వివేక్ ఆత్రేయతో ఊహించని కాంబినేషన్:**

ఆగస్టులో దిల్ రాజు సినిమా మొదలైన రెండు నెలలకే.. అంటే అక్టోబర్ నుంచి రవితేజ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి డిఫరెంట్ మేకింగ్ స్టైల్ ఉన్న వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించబోతున్నారు. ఇప్పటివరకు క్లాస్ అండ్ కంటెంట్ సినిమాలే తీసిన వివేక్.. మొదటిసారి రవితేజ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్,కామెడీ మేళవించి ఒక ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్ రాసుకున్నారట.

**ఫ్లాపుల్లో ఉన్నా తగ్గని రవితేజ మార్కెట్:**

ఇటీవల రవితేజ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడలేదు. గత ఏడాది వచ్చిన 'మాస్ జాతర' కానీ, ఈ ఏడాది విడుదలైన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' వంటి సినిమాలు ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయాయి. ఐనా సరే మాస్ మహారాజా క్రేజ్ అస్సలు తగ్గలేదు. ఇక ఆయన మార్కెట్‌పై నమ్మకంతో ఇప్పటికీ టాలీవుడ్ టాప్ నిర్మాతలు, దర్శకులు ఆయనతో సినిమాలు చేయడానికి లైన్ కడుతున్నారు.

**ఆశలన్నీ రాబోయే సినిమాలపైనే:**

వరుసగా రెండు పెద్ద ప్రాజెక్టులు లైన్‌లో పెట్టడం రవితేజ స్పీడ్‌కు నిదర్శనమే అయినా.. ప్రస్తుతం ఆయనకు ఒక సాలిడ్ బ్లాక్‌బస్టర్ హిట్ చాలా అవసరం. రాబోతున్న 'ఇరుముడి' చిత్రంతో పాటు దిల్ రాజు, వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రాబోయే ఈ రెండు కొత్త సినిమాల్లో కనీసం ఒకటైనా గట్టిగా హిట్ కొడితేనే రవితేజ మళ్లీ ఫుల్ ఫేమ్‌లోకి వస్తారని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

వరుస అనౌన్స్మెంట్స్, షూటింగులతో రవితేజ ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం వచ్చిన మాట నిజమే. కానీ కేవలం స్పీడ్ మాత్రమే కాదు, ఈసారి కంటెంట్ కూడా గట్టిగా ఉంటేనే మాస్ మహారాజా బాక్సాఫీస్ వద్ద పాత వైభవాన్ని అందుకుంటారు. మరి ఆగస్టు, అక్టోబర్ నెలల్లో రాబోతున్న ఈ కొత్త ప్రాజెక్టులు రవితేజను మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తాయో లేదో వేచి చూడాలి..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com